## వడ్డీల పేరుతో రూ.3 కోట్లకు కుచ్చుటోపీ

**అనంతపురం :** వడ్డీల పేరుతో మచ్చిక చేసుకుని నమ్మించిన ఓ ఘనుడు రూ.3 కోట్లు కుచ్చుటోపి పెట్టి పరారీ అయ్యాడు. వివరాల్లోకి వెళ్తే..అనంతపురం నగరంలోని శ్రీనివాసనగర్‌లో గత కొన్ని సంవత్సరాలుగా రఘువీర ప్రసాద్ అనే వ్యక్తి ఫిజియోథెరపీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నాడు. దీనికి తోడు ఆయన రియలెస్టేట్, షేర్ మార్కెట్ వ్యాపారం చేసేవాడు. ఇందుకు గాను వడ్డీలకు రూ.3 కోట్ల వరకు అప్పుచేశాడు. రఘువీర ప్రసాద్ తల్లి విశ్రాంత ఉపాధ్యాయురాలు కావడం, అక్కలు ప్రభుత్వ ఉద్యోగులు కావడంతో అతన్ని నమ్మి బాధితులు డబ్బు అప్పుగా ఇచ్చారు. వ్యాపారంలో నష్టపోవడంతో రఘువీర ప్రసాద్ అప్పు ఇచ్చిన వారందరికీ ఐపి నోటీసులు పంపారు. దీంతో బాధితులు లబోదిబోమంటున్నారు. ధర్మ వడ్డీకి డబ్బు అప్పు ఇస్తే ఐపి నోటీసులు పంపి తమను మానసిక వేధనకు గురిచేస్తున్నారని బాధితులు వాపోతున్నారు. చట్టంలోని లొసుగులను ఆసరాగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్న ఇలాంటివారిని న్యాయస్థానం కఠినంగా శిక్షించి బాధితులకు న్యాయం చేయాలని కోరుతున్నారు. ప్రస్తుతం రఘువీర ప్రసాద్ తల్లి, భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి పరారీలో ఉన్నట్లు సమాచారం.

కర్నాటకకు అక్రమంగా టిప్పర్లలో తరలుతున్న కంకర

## అక్రమంగా కర్నాటకకు కంకర తరలింపు

**మామూళ్ల మత్తులో రెవెన్యూ, మైన్స్ అండ్ జియాలజీ అధికారులు**

**ప్రభుత్వ ఆదాయానికి గండి**

ప్రజాశక్తి-బొమ్మనహాల్

అనుమతులు లేకుండా కర్ణాటక రాష్ట్రానికి కంకర తరలుతోంది. బొమ్మనహాల్ మండలంలోని నేమకల్ గ్రామంలోని కంకర మిషన్ల నుండి రోజూ వచ్చే కంకర బోట్, రాజి పౌడర్‌ను యాజమాన్యం కర్ణాటకకు తరలిస్తూ సొమ్ముచేసుకుంటున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మైన్స్, జియాలజీ శాఖల నుండి అనుమతిపొందిన వారే టన్నుల ప్రకారం కంకర బోట్, రాజి పౌడర్ కర్ణాటకలో అమ్మాల్సి ఉంటుంది. కాసులకు కక్కుర్తిపడి అక్రమంగా కంకర కర్ణాటకకు తరలుతున్నా మైన్స్ అండ్ జియాలజీ అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు ప్రయివేటు కంకర మిషన్ల యాజమన్యాంతో కుమ్మక్కై తూతూ మంత్రంగా ట్రిప్ సీట్లు మంజూరుచేసి జేబులు నింపుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో ప్రభుత్వ ఆదాయానికి బారీగా గండిపడుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. కంకర మిషన్ యజమానులు సైతం బళ్లారిలో నివాసం ఉంటున్నందున వారి వ్యాపారం మూడు పువ్వులు.. ఆరు కాయలు అన్న చందంగా సాగుతోంది. అధికారులు కంకర తోలేందుకు స్థానికంగా ఉన్న టిప్పర్లు, ట్రాక్టర్ల యజమానులకు అనుమతులు ఇవ్వకుండా కర్నాటకలోని బళ్లారిలో ఉండే వ్యాపారులకు టిప్ సీట్లు అందజేస్తున్నట్లు సమాచారం.

**స్థానికులకు అందుబాటులో ఉండని కంకర..**

బొమ్మనహాల్ మండలంలో కంకర ఫ్యాక్టరీలు బోలెడు ఉన్నా స్థానికంగా భవన నిర్మాణాలకు కంకర అందుబాటులో ఉండడంలేదు. ప్రతిరోజు సుమారు 20 టిప్పర్ల పైబడి కంకర కర్ణాటక రాష్ట్రానికి వెళ్తున్నట్లు నెమకల్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఆంధ్రాలో కంకర మిషన్లు ఉన్నా లాభాలు మాత్రం కర్ణాటక వారికే దక్కుతున్నాయని వాపోతున్నారు. పునాదులకు అవసరమైన బోట్ రాస్ తమకు దొరకడం లేదు.. కర్ణాటకలోని వారికి మాత్రం కేవలం గంట సమయంలోనే అందిస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు.

**మామూళ్ల మత్తులో అధికారులు..**

రెవెన్యూ, మైన్స్ అండ్ జియాలజీ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతూ అనుమతులు లేని కార్ణాటక టిప్పర్లు ఆంధ్రాలో ప్రవేశించి కంకర లోడు చేసుకుంటున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. క్వారీల్లో 20 అడుగుల లోతు మాత్రమే బ్లాస్టింగ్ చేయాలి. సుమారు 50 అడుగులకు పైబడి బ్లాస్టింగ్ చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ, మైన్స్ అండ్ జియాలజీ అధికారులు అక్రమ కంకర రవాణాను అరికట్టి ప్రభుత్వ ఆదాయానికి గండిపడకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

# టిడ్కో అలా..జగనన్న కాలనీలో ఇలా..!

**ఎన్నికలు ఎప్పుడు వచ్చినా..ఏ పార్టీ అయినా చెప్పేది ఒక్కటే మాట...పేదల సొంతింటి కలను నెరవేరుస్తామంటూ హామీ ఇవ్వడం. ఎన్నికలు ముగిశాక..ఇచ్చిన సొంతింటి హామీని మాత్రం నెరవేర్చరు. మళ్లీ ఎన్నికలు వస్తాయి..మళ్లీ అదేహామీ. ఆ పార్టీ..ఈ పార్టీ అని కాదు.. ఏపార్టీ అయినా ఇదే తంతు. హిందూపురం పట్టణంలో గత 15 సంవత్సరాల నుంచి పేదల సొంతింటి కల మాత్రం నెరవేరడం లేదు. ఉండడానికి సొంతిల్లు లేక పేదలు రూ.వేలు అద్దె చెల్లించి నివాసం ఉంటున్నారు. గత ప్రభుత్వం కొటపి వద్ద కేంద్ర ప్రభుత్వ సహకారంతో టిడ్కో గృహాల నిర్మాణ పనులను ప్రారంభించింది. ఇదే సమయంలో కర్నాటక రాష్ట్రం తుంకూరులో పనులు ప్రారంభించి.. గృహ ప్రవేశాలు జరిగి.. నివాసాలు ఉంటున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఇంకా పనులే పూర్తికాలేదు. చేసిన పనులకు బిల్లులు మంజూరు చేయకపోవడమే ఇందుకు కారణం. వెరసి పేదల సొంతింటి కల..కలగానే మిగులుతోంది.**

జగనన్న కాలనీలో పునాదులకే పరిమితమైన ఇళ్లు

**దిష్టి బొమ్మల్లా టిడ్కో గృహాలు**

**పునాదులు దాటని జగనన్న కాలనీలు**

**పేదల సొంతింటి కల నెరవేరేనా ?**

ప్రజాశక్తి-హిందూపురం

టిడిపి ప్రభుత్వ హయాంలో ఇళ్లు లేని నిరుపేదల సొంతింటి కలను నెరవేరుస్తామని ఐదేళ్ల క్రితం హిందూపురం పట్టణం కొటపి సమీపంలో టిడ్కో అపార్టమెంట్స్ నిర్మాణ పనులను ప్రారంభించారు. అవి ఇంత వరకు పూర్తి చేయలేదు. అనంతరం వచ్చిన జగనన్న ప్రభుత్వం పేదల సొంతింటి కలను నెరవేర్చడమే తమ లక్ష్యమని జిల్లా వ్యాప్తంగా జగనన్న కాలనీలను ఏర్పాటు చేశారు. మూడు ఆప్షన్లుగా ప్రభుత్వం ఇంటి నిర్మాణాల పనులకు శ్రీకారం చుట్టింది. మొదటి, రెండవ ఆప్షన్లలో లబ్దిదారులే నిర్మాణం చేసుకోవాలని, మూడవ ఆప్షన్‌లో ప్రభుత్వమే నిర్మాణం చేసి ఇస్తుందని లబ్దిదారులకు చెప్పారు. హిందూపురం పురపాలక సంఘంలో రెండు ప్రాంతాల్లో జగనన్న కాలనీలను ఏర్పాటు చేశారు. కొట్నూరు వద్ద ఏర్పాటు చేసిన కాలనీలో కాస్త పనులు జరుగుతున్నాయి. కొటిపి వద్ద ఏర్పాటు చేసిన కాలనీలో ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉంది. ప్రభుత్వం రెండు సార్లు మెగా గ్రౌండింగ్ మేళా చేపట్టింది. కొంతమంది లబ్ధిదారులు సొంత ఖర్చులతో పునాదులు తీయించే విధంగా చర్యలు చేపట్టారు. ఇప్పటివరకు

కొటిపి వద్ద నిర్మాణ దశలో ఆగిపోయినా టిడ్కో ఇళ్లు

లేఅవుట్లలో సిమెంటు రహదారులు, తాగునీటి సరఫరా పైపులైన్లు, విద్యుత్తు సరఫరా వంటి మౌలిక వసతులు కల్పించలేదు. అధికారులు గుత్తేదారులు అడిగిన సిమెంటు, స్టీల్, ఇసుకను సమకూర్చకపోవడంతో గుత్తేదారులు పూర్తి స్థాయిలో పనులు చేయడం లేదు. దీంతో పనులు నిలిచిపోయాయి. మెగా గ్రౌండింగ్ మేళా సమయంలో కొంత మంది తామే సొంతంగా ఇల్లు నిర్మింమించుకుంటామని ముందుకొచ్చారు. అయితే పెరిగిన ధరలకు భయపడి వారు సైతం పునాదులు వేసి వదిలేశారు. మరికొంత మంది మావల్ల కాదు..ప్రస్తుతం పెరిగిన ధరలతో ఇళ్ల నిర్మాణం చేయలేమని చేతులెత్తేశారు. ప్రభుత్వమే ఇళ్ల నిర్మాణం చేసి ఇవ్వాలని అంటున్నారు.

**తొలివిడత 1.20 లక్షల మందికి ఇళ్ల పట్టాలు**

జిల్లాలో తొలి విడత కింద దాదాపు 1.20 లక్షల మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో 1.5 సెంట్లు, పట్టణాల్లో ఒక సెంటు చొప్పున ఇంటి స్థలం కేటాయించారు. రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు మూడు ఐచ్ఛికాలు ఇచ్చి..అందులో ఒకటి ఎంచుకోవాలని చెప్పింది. జిల్లాలో అత్యధిక శాతం మంది ప్రభుత్వమే ఇల్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. హిందూపురం పురపాలక సంఘంలో అయితే మొత్తం 5712 మందిని తొలి విడత ఎంపిక చేశారు. ఇందులో 784 మంది మొదటి, రెండవ ఆప్షన్ల కింద ఇళ్ల నిర్మాణాలను చేపట్టారు. మిగిలిన 4928 మంది లబ్ధిదారులు ప్రభుత్వమే ఇంటిని నిర్మాణం చేసి ఇవ్వాలని కోరారు. దీంతో ప్రభుత్వం బెంగళూరుకు చెందిన న్యూస్ ఏజెన్సీకి పనులను అప్పగించింది. అయినప్పటికీ పనులు మాత్రం వేగవంతంగా జరగడం లేదు. అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి వేగవంతం చేయాలని ఆదేశాలు ఇస్తునప్పటికీ పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. సంవత్సర కాలంగా వేగ వంతంగా పనులు చేస్తున్నప్పటికీ పనులు మాత్రం పునాదులకే పరిమితం అయ్యాయి.

**పెరిగిన ధరలతో ఇదీ పరిస్థితి..**

పేదలందరికీ ఇళ్ల పథకం కింద ఒక్క యూనిట్‌కు రూ.1.8 లక్షలు ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. గ్రామీణ ప్రాంతంలో రూ.1.5 లక్షలు కేంద్రం ఇస్తోంది. రూ.30 వేలు నరేగా కింద సర్దుబాటు చేస్తున్నారు. పట్టణ ప్రాంతంలో రూ.1.50 లక్షలు కేంద్రం ఇస్తోంది. రూ .30 వేలు రాష్ట్రం భరించాల్సి ఉంది. హిందూపురంలో దాదాపు 5600 గృహాలను మంజూరు చేశారు. ఏడాదిలో నిర్మాణాలు పూర్తి చేయాలనేది లక్ష్యంగా పెట్టుకున్నారు. పెరిగిన సిమెంటు, ప్రస్తుతం ప్రభుత్వం ఇచ్చే సాయం సరిపోవడం లేదు. దీనికి ధరల మంట తోడయ్యింది. ఒక గృహం 342 చదరపు అడుగుల విస్తీర్ణంలో పునాదులు, గోడలు స్లాబ్ మాత్రమే నిర్మాణం చేయాల్సి ఉంది. లబ్దిదారులు నిర్మాణం చేసుకుంటే పునాది పూర్తి చేస్తే రూ.60 వేలు, పైకప్పు వరకు స్లాబ్ బిల్లులు నిర్మాణం చేస్తే రూ.60 వేలు, పై కప్పు వేస్తే రూ.30 వేలు చొప్పున చెల్లిస్తారు. అయితే ప్రభుత్వం చెల్లించే నిధులు సరిపోక పోవడంతో నిర్మాణాలు ఏక్కడికక్కడ ఆగిపోయాయి.

ప్రభుత్వం ప్రత్యేక చోరవ తీసుకుని ఇచ్చే నిధులను పెంచి, వారికి అవసరమైన అన్ని సౌకర్యాలూ కల్పించి, బిల్లులు ఎప్పటికప్పుడు మంజూరు చేస్తే నిర్మాణాలు వేగవంతం అయ్యే అవకాశాలు ఉన్నాయి.

## ధర్మాపురంలో తెగిపడిన హైటెన్షన్ తీగలు

**తప్పిన పెను ప్రమాదం**

హైటెన్షన్ వైరు తెగి కింద పడటంతో చెలరేగుతున్న మంటలు

**గుత్తి :** మండలంలోని ధర్మాపురం గ్రామ సమీపంలోని భూముల్లో ఆదివారం సాయంత్రం విద్యుత్ హై టెన్షన్ తీగలు తెగి కిందపడ్డాయి. నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్ టీపీసీ 400కెవి) చెందిన ఇతర ప్రాంతాలకు సరఫరా అయ్యే విద్యుత్తు భారీ స్తంభాలకు సంబంధించిన హై టెన్షన్ తీగలు ఉన్నపలంగా తెగి కింద పడ్డాయి. అయితే అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. తీగలు కింద పడటంతో గడ్డికి నిప్పు రాసుకుని మంటలు ఎగిసిపడ్డాయి. స్థానికులు మంటలను ఆర్పి వేశారు స్థానికుల సమాచారం మేరకు ఎన్టీపీసీ అధికారులు తెగిపడిన తీగలు మరమ్మతులు చేపట్టారు.

పూజలందుకుంటున్న సిద్ధప్ప, తాత స్వాములు

## సిద్ధప్ప, తాతల ఆరాధన ఉత్సవం

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండలంలోని కొలగాణల్లి గ్రామంలో వెలసిన సిద్ధప్ప, తాత స్వాముల ఆరాధనోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు భారీ ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు ఉచితంగా అన్నదానం చేశారు. తర్వాత స్వామివారి చిత్రపటాన్ని పల్లకిలో ఆసీనులు చేసి పురవీధుల గుండా ఊరేగించారు.

## 'స్మార్ట్ స్ట్రీట్'కు శ్రీకారం

**'అనంత' యువకుడి ఆలోచనతో అభివృద్ధి**

ప్రజాశక్తి-అనంతపురం

'మన వీధి.. మన బాధ్యత' అనే ఆలోచనతో నగరానికి చెందిన ఓ యువకుడు స్మార్ట్ స్ట్రీట్‌కు శ్రీకారం చుట్టాడు. నగరంలోని 50వ డివిజన్‌కు చెందిన అనిల్‌కుమార్ డివిజన్ పరిధిలోని అగ్స్‌రెడ్డి వీధిని సుందరీకంచేందుకు చర్యలు చేపట్టాడు. ఈ యువకుడు ముందుండి బాధ్యతగా స్థానికులతో గ్రీన్ ఆర్మీగా ఏర్పడి అభివృద్ధి వైపు నడిపిస్తున్నాడు. ఇందులో భాగంగా సుమారు రూ.2.75లక్షలు ఖర్చు చేసి జైపూర్ నుంచి తెప్పించిన 10 క్యాస్ట్ ఐరన్ బెంచీలు, 2,800 స్క్వేర్ ఫీట్ పెయింటింగ్ వేయించాడు. ఈ వాల్ పెయింటింగ్ కూడా నగర ప్రజల్లో సోషల్ మెసేజ్‌ను నింపేలా నింపాదిగా ఉండటం గమనార్హం. ఓ మహిళ, నీరు, రక్తదానం, పరిసరాల పరిశుభ్రత, పచ్చని మొక్కలు పెంపకం ఇలా ఒక్కటేంటి రూపుదిద్దుకున్న ప్రతి చిత్ర అలంకరణ చూపారులను ఆకర్షిస్తోంది. అంతేగాకుండా ఈ వీధిలో 300 ఎంబిపిఎస్ హై స్పీడ్ వైఫై ఫ్రీగా అందిస్తున్నాడు. విషయం తెలుసుకున్న మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కొగటం విజయభాస్కర్‌రెడ్డి, అదనపు కమిషనర్ రమణారెడ్డి, టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఇన్స్‌పెక్టర్ దుర్గాంజలితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్‌తోపాటు డిప్యూటీ మాట్లాడుతూ నగరాభివృద్ధికి బాధ్యతగా యువకుడు ముందుకు రావడం సంతోషకరమన్నారు. ప్రజలు కూడా ఆయనకు సహకారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో తరిమల అమర్నాథ్‌రెడ్డి, విద్యావేత్త, కవి రమేష్‌నారాయణ, గ్రీన్ ఆర్మీ సభ్యులు పాల్గొన్నారు.

మనవీధి..మనబాధ్యత కార్యక్రమంలో భాగంగా గోడలకు వేసిన రంగులు

## 22న ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ఆవరణలో ఈనెల 22వ తేదీన ఆదివారం ఉచిత కంటి, గుండె వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు విప్ కాపు రామచంద్రారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, బ్రాహ్మణి సోషల్ వెల్ఫేర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగే ఈ శిబిరంలో నంద్యాలకు చెందిన శాంతిరాం కంటి ఆసుపత్రికి చెందిన వైద్యులు రోగులకు కంటి పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఆపరేషన్లు అవసరమైన వారికి నంద్యాలలోని కంటి ఆసుపత్రిలో ఆపరేషన్ నిర్వహిస్తారన్నారు. ఎంప్లాయిస్ హెల్త్ కార్డు ఉన్న వారికి గుండె ఆపరేషన్ల ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## సిపిఎం ఆధ్వర్యంలో సంక్రాంతి పోటీలు

ప్రజాశక్తి-గుత్తి

సంక్రాంతి పండుగ పురస్కరించుకుని పట్టణంలోని జెడ్.వీరారెడ్డి కాలనీలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు వి.నిర్మల ఆధ్వర్యంలో సోమవారం ఆటల పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా చిన్నపిల్లలకు నిమ్మకాయ, చెంచా పోటీలు, అలాగే ఉట్టి కొట్టడం, మ్యూజికల్ చైర్స్ డాన్స్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ నాయకులు యు.మల్లికార్జున, ఎస్.మున్ని తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు పోటీలు నిర్వహిస్తున్న సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు వి.నిర్మల

## 26న శాంతి సద్భావన యాత్ర : ఎఐబిఎస్ఎస్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలకు పిలుపునిస్తూ ఆల్ ఇండియా బంజారా సేవాసంఘ్, సేవాఘడ్ ట్రస్టు ఆధ్వర్యంలో ఈనెల 26న నిర్వహిస్తున్న శాంతి సద్భావన యాత్రకు బంజారాలు, మార్వాడీలు, ప్రజలు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని ఆల్ ఇండియా బంజారా సేవాసంఘ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.బాలాజీనాయక్, పి.బాబునాయక్ తెలిపారు. సోమవారం నగరంలోని బంజారా భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీసేవాలాల్ మహారాజ్ ఉత్సవాలకు బంజారాలను ఆహ్వానం కలుపుతూ 26న బంజారా భవన్ నుంచి సాయంత్రం 3.30 గంటలకు సేవాలాల్ మహారాజ్ శాంతి సద్భావన యాత్ర ప్రారంభం అవుతుందన్నారు. ఈ యాత్రకు రాజస్థాన్ శ్రీ చేతన్ గిరి మహారాజ్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. బంజారా భవన్ నుంచి ప్రారంభమైన యాత్ర రైల్వేస్టేషన్, ఆర్ట్స్ కళాశాల, టవర్‌క్లాక్, సప్తగిరి సర్కిల్, విద్యుత్ నగర్ మీదుగా ఆదర్శనగర్‌లోని మారెమ్మ తల్లి ఆలయానికి చేరుకుంటుందన్నారు. అక్కడ పూజల అనంతరం నాయక్‌నగర్, సేవాలాల్ మహారాజ్, మారియమ్మ తల్లి ఆ లయంలో పూజల అనంతరం యాత్ర ముగుస్తుందన్నారు. కావున ఈయాత్రలో ఉమ్మడి అనంతపురం జిల్లాలోని బంజారాలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐబిఎస్ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.రంగ్లానాయక్, జిల్లా కోశాధికారి ఐ.నారాయణస్వామి నాయక్, జిల్లా సలహాదారులు హెచ్.శేఖర్‌నాయక్, ఎస్ఎన్.క్రిష్ణానాయక్, జిల్లా నాయకులు, న్యాయవాది ఎస్‌కె.ధరమ్‌సింగ్ నాయక్, సూర్యనారాయణ, కిరణ్‌కుమార్, ఎస్‌కె.మహేష్ బంజారా తదితరులు పాల్గొన్నారు.

నగరంలోన ర్యాలీ నిర్వహిస్తున్న ఇండియన్ వెటరన్స్ రాష్ట్ర ఆర్గనేసేషన్ నాయకులు

## ఆర్మీడే సందర్భంగా ర్యాలీ

ప్రజాశక్తి-అనంతపురం

ఆర్మీ డే సందర్భంగా ఇండియన్ వెటరన్స్ రాష్ట్ర ఆర్గనైజేషన్ ఉపాధ్యక్షులు కెప్టెన్ షేకన్న ఆధ్వర్యంలో సోమవారం టవర్‌క్లాక్ నుంచి సప్తగిరి సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కెప్టెన్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దాదాపు రెండు సంవత్సరాలకు 15 జనవరి 1949 నాడు బ్రిటీష్ ప్రభుత్వ ఆధీనంలోని మొదటి భారత సైన్యాధ్యక్ష పదవి జనరల్ కెఎం కరియప్ప బాధ్యతలు స్వీకరించారన్నారు. ఆయన పదవి స్వీకరించిన నాటికి దేశం అస్తవ్యస్తంగా ఉందని గుర్తు చేశారు. దేశానికి ఇటు ఈస్ట్ పాకిస్తాన్‌తో (ఇప్పుడు బంగ్లాదేశ్), అటు వెస్ట్ పాకిస్తాన్‌తోనే కాకుండా చైనాతో కూడా సరిహద్దు వివాదాలతో సతమవుతున్నామన్నారు. ఆ సమయంలో ఈయన జనరల్ అయిన తర్వాత అందరినీ సమన్వయపరిచి భారత్‌ను ఆయా సమస్యల నుంచి విముక్తి కలిగించారన్నారు. అంతేగాకుండా ఇంటర్నల్‌గా ఉన్న 530 సంస్థానాలను దేశంలో కలిపి వేయడానికి సైన్యానికి చాలా సమస్యలు ఎదుర్కోవాల్సి వచ్చిందన్నారు. వాటన్నింటినీ సమర్థవంతంగా నిర్వహించినందుకు ఆయనకు తర్వాత కాలంలో ప్రతిష్టాత్మకమైన ఫీల్డ్ మార్షల్ పదవి ఇచ్చారన్నారు. అనంతరం పట్టణంలోని మాజీ సైనికులు మాస్టర్ వారెంట్ ఆఫీసర్ బషీర్ అహ్మద్, సుబేదార్ కుమారస్వామి, కెప్టెన్ షేఖన్నను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికులు కెప్టెన్ పట్నం ఉమామహేశ్వరరావు, సుబేదార్ శివశంకర్, సురేష్, నాగరాజు, రంగారెడ్డి, నాగిరెడ్డి, బాలస్వామి, సిద్దన్న, వై.ప్రసాద్, సుబ్రహ్మణ్యం, అబ్దుల్‌ఖాదర్, నబిరసూల్, రామ్‌గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

## అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి-గార్లదిన్నె

గ్రామాల్లో పేకాట, మట్కా, కోడి పందాలు వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్ఐ సాగర్ హెచ్చరించారు. ఎస్పీ ఫక్కీరప్ప ఆదేశాల మేరకు సోమవారం మండల పరిధిలోని కనంపల్లి గ్రామంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఇందులో భాగంగా పాతనేరస్తులు, అనుమాతుల ఇళ్లను క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ చట్ట వ్యతిరేక కార్యకలాపాల జోలికి వెళ్లకుండా ప్రశాంతంగా జీవించాలని సూచించారు. అలాకాదని చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు.

గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ సాగర్

పోస్టర్లు విడుదల చేస్తున్న వేమన ఫౌండేషన్ సభ్యులు

## వేమన పద్యపోటీల వాల్‌పోస్టర్లు ఆవిష్కరణ

**అనంతపురం సిటీ :** ప్రజాకవి వేమన జయంతి సందర్భంగా ఈనెల 19న రాష్ట్రవ్యాప్తంగా 100 పాఠశాలల్లో వేమన పద్యపోటీలు నిర్వహించనున్నట్లు వేమన ఫౌండేషన్ నాయకులు తెలిపారు. ఈమేరకు సోమవారం నగరంలోని వేమన పౌండేషన్ కార్యాలయంలో ఇందుకు సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వేమన పౌండేషన్ కార్యదర్శి డా.అప్పిరెడ్డి హరినాథరెడ్డి, విశ్రాంత వైస్ ఛాన్సలర్, పౌండేషన్ అధ్యక్షులు కాడా రామకృష్ణారెడ్డి, సభ్యులు యర్రగుంట కృష్ణారెడ్డి, యరపేటి లోకన్న, మాజీ రిజిస్ట్రార్ రవీంద్రరాజు, రైతుసంఘం నాయకులు కసిరెడ్డి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి ఉషాశ్రీచరణ్ అక్రమ ఆస్తులపై విచారించాలి

**కళ్యాణదుర్గం :** మంత్రి ఉషాశ్రీచరణ్ అక్రమాస్తులపై సిబిఐతో విచారించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సంజీవప్ప డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక బంగీ ఎరిస్వామి మెమోరియల్ హాల్‌లో నియోజకవర్గ సహాయ కార్యదర్శి మహదేవ, వై.గోపాల్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2019 ఎన్నికల అఫిడవిట్‌లో చూపించిన ఆస్తుల విలువలకు, ప్రస్తుతం అక్రమంగా కొల్లగొట్టిన ఆస్తుల తేడాలను గమనించాలని సూచించారు. మూడున్నరేళ్లలో నియోజకవర్గ పరిధిలోని సహజ వనరులను కొల్లగొట్టి విలువ కట్టలేనంత అక్రమాస్తులు ఆర్జించిందని విమర్శించారు. ముఖ్యంగా ఇసుక రవాణా, లే ఔట్ల అనుమతుల పేరుతో రూ.కోట్లు వసూలు చేసిందని ఆరోపించారు. ఎన్నికల ముందు 114 చెరువులకు నీరిస్తామని ప్రగల్భాలు పలికి నేటికీ గంప మట్టిని కూడా తీయలేదని దుయ్యబట్టారు. ఈ సమావేశంలో హరిదాసు, మహదేవప్ప, అశ్వర్థ, తిరుపాల్, తదితరులు పాల్గొన్నారు.

## పెద్దమ్మ జాతరకు ఆహ్వానం

**ఆత్మకూరు :** మండల పరిధిలో తోపుదుర్తి గ్రామంలో దాదాపు 140 ఏళ్ల తర్వాత తోపుదుర్తి కుటుంబం, గ్రామస్తుల ఆధ్వర్యంలో ఈనెల 17, 18న నిర్వహించనున్న పెద్దమ్మ తల్లి ఊరు దేవరకు వేపచెర్ల, ఎగువ తండా, దిగువతండా ప్రజలకు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సోదరుడు చంద్రశేఖర్‌రెడ్డి ఆహ్వాన పత్రికలు అందజేశారు. 17న ఉదయం వీరాంజనేయ స్వామికి జ్యోతులు, మధ్యాహ్నం పోతురాజు ఊరేగింపు, గ్రామార్పణ కార్యక్రమం, రాత్రి 11:30 గంటలకు బలిహరణం, జలిగంప ప్రదక్షిణం, 18న మధ్యాహ్నం మంగళహారతి అనంతరం అమ్మవారిని పొలిమేరకు చేర్చే కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల ప్రజలు కుల, మత పార్టీలకతీతంగా జాతరకు రావాలని కోరారు.

ప్రజలను జాతరకు ఆహ్వానిస్తున్న తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి

## పూర్వవిద్యార్థుల అపూర్వ కలయిక

**రొద్దం :** పూర్వవిద్యార్థుల అపూర్వ కలయిక మండల కేంద్రంలోని టీచ్ హైస్కూల్‌లో సోమవారం నిర్వహించారు. ఈ పాఠశాలలో 2010-2011 సంవత్సరంలో పదోతరగతి చదివిన విద్యార్థులు సమావేశమయ్యారు. ఈసందర్భంగా అప్పటి తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అప్పటి తమ జ్ఞాపకాలు గుర్తుకు చేసుకుని సంతోషంగా గడిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అంజనరెడ్డి, తిమ్మారెడ్డి, విశ్వనాథ, తిమ్మారెడ్డి, విద్యార్థులు శషిధర్ రెడ్డి, నరేష్ ,తోటి విద్యార్థులు పాల్గొన్నారు.

## సంతోషాల సంక్రాంతి

**బత్తలపల్లి :** మండలంలో సంక్రాంతి పండుగను ఆనందోత్సహాల నడుమ గ్రామీణులు జరుపుకున్నారు. ప్రతి గ్రామంలో తెలుగువారి లోగిళ్లు కళకళలాడాయి. కళ్లాపు చల్లిన ముంగిళ్లలో రంగవల్లులపై గొబ్బెమ్మలు పెట్టి అందులో నవధాన్యాలు పోసి పూజలు చేశారు. అంతేకాక చిన్నారుల నుంచి పెద్దల వరకు గాలిపటాలను ఎగురవేస్తూ సందడి చేశారు. ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. సోమవారం రోజున కనుమ పండుగ ఘనంగా నిర్వహించారు. రైతులు తమ ఇళ్లల్లోని గోవులను శుభ్రంగా కడిగి పసుపు, కుంకుమతో కొమ్ములను అలంకరించారు. అడపడుచులు తమ ఇంటి ముంగిట రంగవల్లులు వేసి రంగులను తీర్చిదిద్దారు.

## వెండి త్రిశూలం వితరణ

**ధర్మవరం టౌన్ :** పట్టణంలోని దుర్గమ్మతల్లి దేవాలయానికి పట్టణానికి చెందిన దాసరి వెంకటేశులు కుమారుడు కార్తీక్ దంపతులు వెండి త్రిశూలం వితరణ చేశారు. రూ. 86 వేల విలువజేసే 100 గ్రాములు బరువుగల వెండి త్రిశూలాన్ని ఆలయ చైర్మన్ పర్వతయ్యకు, ఈవో వెంకటేశులకు అందజేశారు. అనంతరం ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

## వడ్డే ఓబన్న విగ్రహ ఏర్పాటుకు కృషి

**ప్రజాశక్తి-ఉరవకొండ**

స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న విగ్రహ ఏర్పాటుకు కృషి చేద్దామని వడ్డెర సంఘం నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం ఉరవకొండలోని ఆర్‌అండ్‌బి బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వడ్డే ఓబన్న విగ్రహం ఏర్పాటుకు అందరం కలిసికట్టుగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఇందులో భాగంగా ఇందుకు సంబంధించిన అంశాలపై చర్చించేందుకు ఫిబ్రవరి 1న నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ఐదు మండలాల్లోని వడ్డెర్లందరూ ఉరవకొండలో నిర్వహించనున్న నియోజకవర్గస్థాయి సమీక్ష సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అంతేగాకుండా వడ్డే ఓబన్న జయంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం నాయకులు గోవిందరాజులు, ఆంజనేయులు, భీమేష్‌బాబు, లాలుస్వామి, వీరన్న, బాబు, గంగరాజు, అంపయ్య, మల్లీ, శంకరయ్య, మోహన్, ఎర్రిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వడ్డెర సంఘం నాయకులు

## సుంకలమ్మ ఆలయానికి రూ.26.10 లక్షల ఆదాయం

**ప్రజాశక్తి-గుత్తి**

మండలంలోని బాచుపల్లి గ్రామ సమీపంలో 44వ జాతీయ రహదారి పక్కన ఉన్న బాటసుంకలమ్మ ఆలయానికి రూ.21.10లక్షల ఆదాయం లభించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 2023 సంక్రాంతి పండుగ నుంచి 2024 సంక్రాంతి పండుగ వరకు టెంకాయలు విక్రయ హక్కు కోసం ఆదివారం ఆలయంలో బహిరంగ వేలంపాట నిర్వహించారు. ఈ వేలంలో వన్నెదొడ్డి గ్రామానికి చెందిన మద్దయ్య రూ.26.10 లక్షలకు పాడి హక్కును దక్కించుకున్నాడు. వేలం సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకున్న సిఐ ఎం.వెంకటరామిరెడ్డి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కె.రమేష్‌నాయుడు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు అంబటి నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

వేలంపాట నిర్వహిస్తున్న సుంకులమ్మ ఆలయ కమిటీ సభ్యులు

## గురువులు దైవంతో సమానం

**ప్రజాశక్తి-బెలుగుప్ప**

తల్లిదండ్రుల తర్వాత విద్యాబుద్ధులు నేర్పే ఉపాధ్యాయులు దైవంతో సమానమని పలువురు వక్తులు కొనియాడారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఆదివారం మండల పరిధిలోని వెంకటాద్రిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వపు విద్యార్థులు 66వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పట్లో విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పూర్వపు విద్యార్థులు మాట్లాడుతూ చదువులు నేర్పిన గురువులు దైవంతో సమానమన్నారు. ఉపాధ్యాయులు ఎంతో క్రమశిక్షణతో తమకు విద్యాబుద్ధులు నేర్పి ఉన్నత స్థాయికి చేర్చేరన్నారు. ఈ కార్యక్రమంలో గురువులు సత్యనారాయణ, వెంకటేశులు, శ్రీరాములు, కమలనాబుడు, వెంకటరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాల్, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, ఈశ్వరప్ప, పూర్వపు విద్యార్థులు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

గురువులను సన్మానిస్తున్న పూర్వపు విద్యార్థులు

## అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

నగరంలోని రైల్వేటేషన్ దగ్గర వినాయక గ్రాండ్ ముందు ఉన్న బస్టాఫ్‌లో సోమవారం ఉదయం ఓ అనాథ చనిపోవడంతో ఆవాజ్ ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఉదయం గుర్తుతెలియని వ్యక్తి చనిపోవడంతో స్థానికులు మూడవ టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఆవాజ్ నగర కార్యదర్శి కవలికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి నగర ముత్తువల్లి షకీల్ షఫీ సహకారంతో దహన సంస్కారాలు చేశారు. ఈ కార్యక్రమంలో త్రీటౌన్ పోలీస్ సిబ్బంది నజీర్ బాబయ్య, అన్వర్, ఆవాజ్ నగర అధ్యక్ష, కార్యదర్శులు మసూద్, బాబు, ఇస్మాయిల్, శర్మాస్, ఎస్.కె.ఇమామ్‌బాషా, మసూద్‌వలి, ఫక్రుద్దీన్, వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

అనాథ శవాన్ని అంత్యక్రియలకు తీసుకెళ్తున్న ఆవాజ్ కమిటీ సభ్యులు

## క్రికెట్ టోర్నీ విజేత రాయల్స్ లెవెన్

**ప్రజాశక్తి-యల్లనూరు**

మండలంలోని తిరుమ్మలాపురం గ్రామంలో యువకులు ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నీని రాయల్స్ లెవెల్ విజయం సాధించింది. ఈటోర్నీలో ప్రశాంత్ టీమ్, భూర్జు బాస్టర్ నవీన్ టీమ్, రాయల్స్ లెవెన్ వినోద్ టీమ్, మైటివారియర్స్ యోగనంద టీమ్, జైన్స్ ఆప్ టీమ్ తలపడ్డాయి. ఇందులో మైటివారియర్స్, రాయల్స్ లెవెన్ జట్లు ఫైనల్స్‌కు చేరుకోగా రాయల్స్ లెవెన్ టీమ్ విజయం సాధించింది. విజేత జట్టుకు తిరుమ్మలాపురం సర్పంచి అజ్జుగుట్టు రామాంజులరెడ్డి టోర్నీ అందజేశారు.

ట్రోఫీ అందజేస్తున్న సర్పంచు రామాంజులరెడ్డి

## ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

**ప్రజాశక్తి కదిరి టౌన్**

కదిరి రూరల్ మండలం కుమ్మరవాండ్లపల్లిలోనిమ వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బత్తల హరిప్రసాద్ నివాసంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రజాశక్తి దినపత్రిక ప్రచురించిన 2023 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ హరిప్రసాద్ మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా నిలుస్తూ ప్రజా సమస్యలను ప్రభుత్వం అధికారుల దృష్టికి తీసుకెళ్తూ సమస్యల పరిష్కారానికి చొరవ చూపిస్తున్న ప్రజాశక్తి దినపత్రిక మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు బాహుద్దీన్, వైస్ ఎంపీపీ భర్త ఆదినారాయణ, మాజీ సర్పంచి బత్తల వెంకటరమణ, ముబారక్, బాబ్జాన్ తదితరులు పాల్గొన్నారు.

## వడ్డే ఓబన్న ఆశయ సాధనకు కృషి

**ప్రజాశక్తి రొద్దం**

వడ్డే ఓబన్న ఆశయాల సాధనకు కృషి చేద్దామని నాయకులు పేర్కొన్నారు. సోమవారం మండలంలో వడ్డే ఓబన్న జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక బస్టాండ్ సమీపంలో చావిడి వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర వడ్డెర సంఘం అధ్యక్షులు వెంకట్ హాజరయ్యారు. వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఐకమత్యంతో హక్కులను సాధించుకుందామని పిలుపునిచ్చారు. తొలితరం స్వాతంత్ర సమరయోధులు, రేనాటి వీరులు వడ్డే ఓబన్న జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని, పాఠ్య పుస్తకాలలో వడ్డే ఓబన్న జీవిత చరిత్రను పొందుపరచాలని డిమాండ్ చేశారు. వడ్డెర్లు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అన్ని రంగాలలో రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వడ్డెర సంఘం నాయకులు సానిపల్లి శ్రీనివాసులు, సిఫారం శ్రీనివాసులు, తాడంగిపల్లి రాజు, గంగాధర్, క్రిష్టప్ప, శ్రీరాములు, అక్కులప్ప, రమేష్, సురేష్, అంజినప్ప తదితరులు పాల్గొన్నారు.

జాతరకు విరాళం అందజేస్తున్న తెలుగు యువత రాష్ట్ర నాయకులు దండు శ్రీనివాసులు

## నల్లమ్మ జాతరకు విరాళం

**ప్రజాశక్తి-శింగనమల**

మండల పరిధిలోని తరిమెల గ్రామంలో మంగళవారం నిర్వహించనున్న నల్లమ్మ అమ్మవారి జాతరకు టిడిపి తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు రూ.25వేల ఆర్థికసాయం అందజేశారు. తరిమెల ఎస్సీ కాలనీకి చెందిన నల్లమ్మ ఆలయ కమిటీ సభ్యులు విరాళం అందజేయాలని దండు శ్రీనివాసులును ఆశ్రయించగా విరాళం అందజేసినట్లు తెలిపారు. అలాగే తరిమెలకు చెందిన వంశీగోకుల్‌రెడ్డి జాతరకు రూ.25 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంజీవ, రమేష్‌రెడ్డి, గోరక శీన, కుమార్, పుల్లయ్య, ఆలయ పెద్దలు పూజారిపెద్దన్న, పూజారి రాజు, ఎం.నల్లప్ప, కోట్టం నాగులు, ఎస్.నల్లప్ప, కూళ్లాయప్ప, దైవయత్నం, తప్పిడి సుంకన్న, తదితరులు పాల్గొన్నారు.

## మహాధర్నా పోస్టర్లు విడుదల

**ప్రజాశక్తి-శింగనమల**

ఈనెల 6వ తేదీన జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న మహాధర్నాకు సంబంధించిన పోస్టర్లను సోమవారం మండల పరిధిలోని తరిమెల గ్రామంలో ఉన్న బస్టాండ్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి తరిమెల రామంజి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రకటించిన నవరత్నాల్లో భాగంగా రాష్ట్రంలో అందరికీ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యల పరిష్కారానికి ఈనెల 6న మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ధర్నాలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్వర్ణగప్ప, దుబ్బన్న, రాజశేఖర్, శ్రీనివాసులు, నల్లప్ప, ఈశ్వరయ్య, దైవత్వం మహబూబ్, బాషా, మసూద్‌వలి, నాగమ్మ, వెంకటలక్ష్మి, రామంజి, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

## క్యాలెండర్ ఆవిష్కరణ

**ప్రజాశక్తి-రాయదుర్గం**

పట్టణంలోని భక్త మార్కండేయస్వామి దేవాలయంలో పద్మశాలి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లాశాఖ రూపొందించిన నూతన క్యాలెంటర్‌ను అసోసియేషన్ గౌరవాధ్యక్షులు సోమమల్లేశప్ప, అధ్యక్షులు అరవ శివప్ప ఆధ్వర్యంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ పద్మశాలి సామాజిక వర్గానికి ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. అనేకమంది రాజకీయంగా, ఉద్యోగులుగా ఎదగడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బడిగంటి శ్రీనివాస్, కార్యదర్శి కొంతం శివ రుద్రప్ప, కోశాధికారి సురేష్ బాబు, రాష్ట్ర కోశాధికారి చంద్రశేఖర్, రాష్ట్ర కార్యదర్శి జగన్నాథ్, రాయదుర్గం పురపాలక సంఘం అధ్యక్షులు పోరాలు శిల్ప, మున్సిపల్ వార్డు సభ్యులు, ఆలయ ధర్మకర్త పలువురి ముకుంద, సమాజం ప్రధాన కార్యదర్శి చుంచుల నాగప్ప, ఉపాధ్యక్షులు పాండు, కోశాధికారి రామచంద్రప్ప, ప్రచార కార్యదర్శి గురు రాఘవేంద్ర ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న పద్మశాలి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు

## క్రీడలతో మానసికోల్లాసం

**ప్రజాశక్తి ధర్మవరం టౌన్**

ఉద్యోగస్తులు క్రీడల్లో పాల్గొంటే ఒత్తిడి దూరమై మానసిక ప్రశాంతత లభిస్తుందని మండల క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు వడ్డెబాలాజీ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల కరస్పాండెంట్ సీతారామయ్య, చేనేత వ్యాపారులు నిమ్మ చంద్ర, కిరణ్ తెలిపారు. స్థానిక ఎమ్మార్సీ మైదానంలో జరుగుతున్న షటిల్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. ఫైనల్‌లో లోకేష్, చైతన్య జట్టుపై అలి, రమేష్ జట్టు విజయం సాధించింది. విన్నర్‌కు రూ.10వేలు, రన్నర్‌కు రూ.5వేలు, మూడో బహుమతిగా రూ. 2 వేలు, నాల్గవ బహుమతి రూ. వెయ్యి నగదు బహుమతితోపాటు మెమెంటోలను అతిథుల చేతులమీదుగా క్రీడాకారులకు అందించారు. ఈ కార్యక్రమంలో టోర్నీ ఆర్గనైజర్ కృష్ణప్రసాద్. అధ్యక్షులు మధు, కార్యదర్శి రాజ, సహాయ కార్యదర్శి నాగేంద్ర, సభ్యులు అఖిల్, లచ్చి, నారాయణస్వామి, ధను, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## సెమీఫైనల్స్ చేరిన సత్యసాయి జిల్లా జట్టు

**ప్రజాశక్తి ధర్మవరం టౌన్**

నంద్యాలలో జరుగుతున్న 13వ రాష్ట్రస్థాయి జూనియర్ బాలుర హాకీ పోటీలలో సత్యసాయి జిల్లా జట్టు సెమీఫైనల్‌కు చేరినట్టు కోచ్ హస్సేన్ తెలిపారు సోమవారం ఉదయం జరిగిన లీగ్ మ్యాచ్లో ఏలూరు జట్టుపై 4-1 గోల్స్ తేడాతో సత్యసాయి జిల్లా జట్టు గెలిచింది. సెమీఫైనల్లో సత్యసాయి జిల్లా జట్టు, అనకాపల్లి జట్లు తలపడనున్నట్టు కోచ్ తెలిపారు. దీంతో హాకీ అంధ్రప్రదేశ్ వైస్ ప్రసిడెంట్ బంధనాథం సూర్యప్రకాశ్, సత్యసాయి జిల్లా అధ్యక్షులు బీవీ శ్రీనివాసులు, ధర్మాంబ హాకీ అసోషియేషన్ ప్రతినిధులు బండివేణుగోపాల్, పల్లెం వేణుగోపాల్, అంజన్న, గౌరిప్రసాద్ తదితరులు జట్టు సభ్యులను అభినందించారు.

## 18న ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలు

**తనకల్లు :** మండల కేంద్రంలో ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలను ఈనెల 18న నిర్వహిస్తున్నట్లు టిడిపి మండల కన్వీనర్ రెడ్డి శేఖర్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగంగా 18న ఉదయం 10 గంటలకు మండల పరిధిలోని కొక్కంటి క్రాస్ నుండి మండలకేంద్రానికి భారీ బైక్ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. అనంతరం అంబేద్కర్ కూడలిలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం కదిరి తేరుబజార్లోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో నిర్వహించబోయే రక్తదాన శిబిరానికి వెళతామన్నారు.

## రైలు ఢీ కొని 53 గొర్రెలు మృతి

### రూ.8లక్షల వరకు నష్టం

**ప్రజాశక్తి బత్తలపల్లి**

మండలంలోని డి. చెర్లోపల్లి వద్ద ప్రమాదవశాత్తు రైలు ఢీ కొనడంతో 53 గొర్రెలు మృతిచెందాయి. దీంతో గొర్రెల కాపరికి రూ.8లక్షలు దాకా నష్టం వాటిల్లింది. మండలంలోని డి. చెర్లోపల్లికి చెందిన సుధా ప్రసాద్. చెడిపోతుల నారాయణప్ప ప్రవేటు వ్యక్తుల వద్ద రూ.8లక్షలు దాకా అప్పు చేసి 60 గొర్రెలను కొనుగోలు చేశారు. యధాప్రకారం ఆదివారం గొర్రెలను మేపులకు తీసుకువెళ్లారు. రైల్వే పట్టాల సమీపంలోని ఓ పొలంలో ఉన్న గొర్రెలు ఉన్నఫలంగా రైలు శబ్దానికి బెదిరిపోయి రైల్వే పట్టాలపైకి ఎక్కాయి. ధర్మవరం నుంచి తిరుపతి వెళుతున్న రైలు వీటిమీద దూసుకుపోవడంతో 53 గొర్రెలు మృతిచెందాయి. విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన వైసిపి నాయకులు ముసలయ్య, నారాయణస్వామి తదితరులు బాధిత రైతులను పరామర్శించారు.

# నేరాలు ఘోరాలు

## శాతవాహన పరిశ్రమలో కార్మికుడు మృతి

మృతిచెందిన విభేష్

**బొమ్మనహాల్ :** మండలంలోని శాతవాహన పరిశ్రమలో విధులు నిర్వహిస్తున్న వలస కార్మికుడు ప్రమాదవశాత్తు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... బీహార్ రాష్ట్రంలోని గయా జిల్లాలోని కుగ్ గ్రామానికి చెందిన విభేష్ (38) శాతవాహన పరిశ్రమలో ఒప్పంద కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. ఈనేపథ్యంలో పరిశ్రమలో విధులు నిర్వహిస్తుండగా దాదాపు 4 అడుగుల ఎత్తు నుంచి కాలు జారి కింద పడటంతో మృతిచెందినట్లు తెలుస్తోంది. వెంటనే తోటి కార్మికులు చికిత్స నిమిత్తం బళ్లారి ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించినట్లు స్థానికులు చెబుతున్నారు. వెంటనే పోస్టుమార్టం అనంతరం స్వగ్రామానికి మృతదేహాన్ని తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈమేరకు బొమ్మనహాల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.కాగా పరిశ్రమలో ప్రమాదం జరిగిన వెంటనే తమకు సమాచారం ఇవ్వకుండా ఆసుపత్రికి తరలించి మృతిచెందాక తెలపడంతో పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని విభేష్ సోదరుడు సందీప్ వాపోయాడు. పరిశ్రమలోనే మృతిచెందినా ఎవరికీ చెప్పకుండా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించాడని చిత్రీకరించారని ఆరోపించారు. ముఖ్యంగా హెల్మెట్ లేకపోవడమే ప్రమాదానికి కారణమని తోటి కార్మికులు వాపోతున్నారు.

## మద్యం స్వాధీనం

**పుట్లూరు :** మండల పరిధిలోని బాలాపురం క్రాస్‌లో 94 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెంకటప్రసాద్ తెలిపారు. సోమవారం బాలాపురం క్రాస్‌లో వాహనాలను తనిఖీ చేస్తుండగా యల్లనూరు మండలం తిమ్మంపల్లి గ్రామానికి చెందిన రాజశేఖర్‌రెడ్డి ద్విచక్ర వాహనంలో మద్యం బాటిళ్లను తరలిస్తుండగా స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టు చేసినట్లు తెలిపారు.

## మహిళ ఆత్మహత్యాయత్నం

**పుట్లూరు :** మండల పరిధిలోని కందికాపుల గ్రామానికి చెందిన గొల్ల రాజేంద్ర భార్య అమృత ఆదివారం ఇంట్లో ఉరేసుకుంది. అయితే వెంటనే గమణించిన స్థానికులు బంధువులు తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచనమేరకు అనంతపురం తరలించారు. కాగా సంక్రాంతి పండుగకు పుట్టింటికి పంపలేదని మనస్థాపం చెంది ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు బంధువులు తెలిపారు.

## గొర్రెల కాపరులపై దాడి..

**గుత్తి :** మండలంలోని ఇసురాళ్లపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు గొర్రెల కాపరులపై సోమవారం ఆదే గ్రామానికి చెందిన పలువురు దాడి చేశారు. గొర్రెల కాపరులు రాజగోపాల్, ప్రసాద్ తమ గొర్రెలను గ్రామ శివారులో మేపుతుండగా గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి, అతని కుమారుడు కోటేశ్వర్‌రెడ్డితో పాటు 8 మంది కలసి తమ భూముల్లో గొర్రెలను మేపకూడదని అడ్డు చెప్పారు. వాదనకు దిగిన గొర్రెల కాపరులపై కర్రలతో దాడి చేసి గాయపరిచారు. గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. దళితులైన గొర్రెల కాపరులు రాజగోపాల్, ప్రసాద్‌ను అగ్రకులాలకు చెందిన వ్యక్తులు కులం పేరుతో దూషిస్తూ దాడి చేయడం హేయమైన చర్య అని ఎపి ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు అంజన్‌ప్రసాద్ అన్నారు. దాడి చేసిన వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

## పట్టుబడిన మేకల దొంగలు

పట్టుబడిన మేకల దొంగలు

**రాయదుర్గం :** పట్టణ పరిధిలోని పైతోట వద్ద కొందరు వ్యక్తులు వాహనంలో వచ్చి మేకులను ఎత్తుకెళ్లడానికి ప్రయత్నించగా కాలనీవాసులు సోమవారం తెల్లవారుజామున ఇద్దరిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. జిల్లాలోని ఆత్మకూరు ప్రాంతానికి చెందిన కొందరు వ్యక్తులు పైతోట వద్ద మేకలను ఎత్తుకెళ్లేందుకు వాహనంలో వచ్చారు. ఇందులో భాగంగా మేకలను ఎత్తుకెళ్తుండగా గమణించిన కాపరులు గట్టికా కేకలు వేశారు. దీంతో స్థానికులు వెంబడించి ఇద్దరిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. మిగిలినవారు పరారయ్యారు. కాగా వాహనంతోపాటు ఇద్దరు నిందితులను పోలీసులకు అప్పగించారు. ఈ విషయమై దర్యాప్తు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

## గుజిరీ గోడౌన్ దగ్ధం

**బెలుగుప్ప :** మండల కేంద్రంలోని సొసైటీ దగ్గర ఉన్న గుజిరీ గోడన్ దగ్ధమవడంతో సుమారు రూ.80వేల రూపాయలు నష్టం జరిగిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. గుజిరీ వ్యాపారి అబ్దుల్లా తెలిపిన వివరాల మేరకు.. మండల కేంద్రంలోని సింగిల్ బెడ్ సొసైటీ దగ్గర గుజిరీ ఏర్పాటు చేసుకుని వ్యాపారం చేసుకుంటున్నాడు. ఈనేపథ్యంలో ఆదివారం సాయంత్రం షెడ్‌లో ఉన్న బ్యాటరీలు, సోలార్ రెగ్యులేటరీలు, రాగి సామాగ్రి ప్లాస్టిక్ సామాగ్రి కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గమణించిన స్థానికులు అబ్దుల్లాకు తెలిపారు. ఆయన కళ్యాణదుర్గం అగ్ని మాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలు ఆర్పేలోపు గుజిరీ పూర్తిగా కాలిబూడిదైనట్లు వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

కాలిన గుజిరీలోని వస్తువులు

## గాలిపటం ఎగురవేస్తూ బాలుడు మృతి

### భవనం పైనుంచి కిందపడడంతో ప్రమాదం

**మడకశిర :** గాలిపటం ఎగురవేస్తూ ప్రమాదవశాత్తు ఇంటిపై నుంచి కిందికి పడి బాలుడు మృతిచెందిన సంఘటన పట్టణంలోని శంకరప్ప బావి కాలనీలో చోటు చేసుకుంది. అందుకు సంబందించిన వివరాలు... పట్టణం శంకర్ నగర్‌లో నివాసం ఉన్న ఆకుల సిద్దేశ్ కుమారుడు ఫణీంద్ర(12) సంక్రాంతి పండుగ సందర్భంగా గాలిపటం ఎగురవేయడానికి తమ ఇంటి ఎదురుగా నూతనంగా నిర్మిస్తున్న భవనం పైకి వెళ్లాడు. గాలిపటం ఎగుర వేస్తున్న సమయంలో కాలుజారి భవనం పైనుంచి కిందపడ్డాడు. ఆసమయంలో బాలుడు కేకలు విన్న ఇంటిలో ఉన్న తల్లి దండ్రులు బయటకు వచ్చారు. తలకు బలమైన గాయంతో పడి ఉన్న కుమారుడుని చూసి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా వుండడంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకు తరలించారు. బెంగళూరులో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. శనివారం రాత్రి బాలుడుమతి చెందాడు. ఫణీంద్ర ఆమిదాలగొంది ఉన్నత పాఠశాలలో ఆరవ తరగతి చదువు తున్నాడు. బాలుడి తల్లిదండ్రులు మడకశిర పట్టణంలో పూల వ్యాపారం చేసుకుని జీవనం సాగిస్తున్నారు. కుమారుడి మృతితో అతని తల్లిదండ్రులు చేస్తున్న రోదనలు చూపరులను కంటతడి పెట్టించాయి.